APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ ఆదివారం 06 సెప్టెంబర్ 2026 సంపుటి: 01 సంచిక :102 పేజీలు : 04 వెల: 2-00/-

## కర్నూలులో రూ.2 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి టీజీ భరత్ శంకుస్థాపన



- ఏపీ పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ కర్నూలు జిల్లాలో రూ. 2 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.
- ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు.

కర్నూలు, సెప్టెంబరు 5: జిల్లాలోని మార్కెట్ యార్డులో రూ. 50 లక్షల వ్యయంతో చేపడుతున్న షెడ్ నిర్మాణానికి మంత్రి టీజీ భరత్ శంకుస్థాపన చేశారు. వీటితో పాటు జిల్లాలో మొత్తం రూ. 2 కోట్ల అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. రైతుల సౌకర్యార్థం జిల్లా మార్కెట్ యార్డులో నూతన షెడ్ నిర్మాణాన్ని చేపట్టినట్టు మంత్రి తెలిపారు. దీంతో పాటు రానున్న రోజుల్లో

# 12వ పీఆర్సీ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు అంగీకారం

- సీఎం చంద్రబాబుతో సానుకూలంగా ముగిసిన ఉద్యోగ సంఘాల చర్చలు
- అక్టోబర్ 1 నుంచి రెండు డీఏలు చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకారం
- సరెండర్ లీవులు జనవరిలో ఇవ్వాలని నిర్ణయం
- ఉద్యోగ సంఘం నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ

**సంబరాల్లో ఉద్యోగ సంఘాలు**



అమరావతి : ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వ ఉద్యోగులకు తీపి కబురు అందించారు. ఆర్థికంగా ఊరటనిచ్చే పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రెండు డీఏలను మిగతా..2లో

## రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటున్నట్టు అయ్యన్న ప్రకటన




- ఇక రాజకీయాల నుంచి తప్పుకుంటా.. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను
- వయసు పైబడటం వల్ల విశ్రాంతి తీసుకోవాలనుకుంటున్నానని వెల్లడి
- ఈ మూడేళ్ల కాలంలో తన నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తానన్న అయ్యన్న

అమరావతి: ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సంచలన ప్రకటన చేశారు. తాను ఇకపై రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. మిగతా..2లో

## జెలెన్స్కీ కాల్పుల విరమణ ప్రతిపాదన.. కీవ్‌పై 3 రోజులు దాడులు చేయబోమన్న పుతిన్..

- రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు మరోసారి దౌత్య ప్రయత్నాలు జోరందుకున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది.
- ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై మూడు రోజుల పాటు దాడులు నిలిపివేస్తున్నట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించారు.



ఢిల్లీ : రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు మరోసారి దౌత్య ప్రయత్నాలు జోరందుకున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై మూడు రోజుల పాటు దాడులు నిలిపివేస్తున్నట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రత్యేక ప్రతినిధులు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్.. రష్యా, ఉక్రెయిన్ పర్యటనలకు సిద్ధమవుతున్న సమయంలో ఈ ప్రకటన రావడం ప్రాధాన్యం సంతరించుకుంది రష్యా-ఉక్రెయిన్ మధ్య తాత్కాలిక కాల్పుల విరమణకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ శుక్రవారం ప్రతిపాదన చేశారు. అమెరికా ప్రతినిధులు రష్యా, ఉక్రెయిన్‌లలో చర్చలు జరిపే సమయంలో ఉక్రెయిన్ వైపు నుంచి వైమానిక దాడులు ఉండవని జెలెన్స్కీ చెప్పారు.

## ఉపాధ్యాయుల కంటతడి ఏ దేశానికి, ఏ రాష్ట్రానికి మంచిది కాదు



- ఉపాధ్యాయ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపిన బండి సంజయ్
- ఉపాధ్యాయులు అరాకలితో అలమటిస్తున్నారని ఆవేదన
- ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్

ఢిల్లీ : ఉపాధ్యాయుల కన్నీళ్లతో ఏ దేశం కానీ, రాష్ట్రం కానీ బాగుపడదని, ఈ పచ్చి నిజాన్ని మిగతా..2లో

## విద్యార్థుల్లో డ్రగ్స్, స్క్రీన్ టైం విషయంలో అప్రమత్తంగా ఉండాలి'

- ఉపాధ్యాయులకు ప్రధాని మోదీ సూచన
- విద్యార్థుల్లో మాదకద్రవ్యాల వినియోగంపై ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని ప్రధాని మోదీ సూచన
- పిల్లలు మొబైల్ ఫోన్లకు బానిస కాకుండా క్రీడల వైపు మళ్లించాలని పిలుపు



ఢిల్లీ : విద్యార్థుల్లో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగం, అధిక స్క్రీన్ టైమ్‌పై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు. పిల్లలను కేవలం చదువులోనే కాకుండా వారి ప్రవర్తన, రోజువారీ జీవితం, ఆసక్తులు, అలవాట్ల పరంగా కూడా గమనించాలని చెప్పారు. క్రీడలు, శారీరక ఆటలు, సృజనాత్మక కార్యక్రమాల ద్వారా పిల్లలను మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని సూచించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జాతీయ అవార్డులకు ఎంపికైన ఉపాధ్యాయులతో ప్రధాని మోదీ శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పిల్లల భవిష్యత్తు, విద్యా విధానం, డ్రగ్స్, స్క్రీన్ టైమ్ వంటి అంశాలపై వారితో చర్చించారు. ఈ భేటీకి సంబంధించిన వీడియోను శనివారం విడుదల చేశారు. మిగతా..2లో

## తిరుమలలో భక్తుల వెల్లువ.. దర్శనానికి 20 గంటల నిరీక్షణ



- వారాంతం కావడంతో తిరుమలకు పోటెత్తిన భక్తులు
- నిండిపోయిన వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు
- శుక్రవారం రోజు హుండీ ఆదాయం రూ.4.03 కోట్లు
- క్యూలైన్లలో భక్తులకు ఆహారం, తాగునీరు అందిస్తున్న టీటీడీ

అమరావతి: వారాంతం కావడంతో తిరుమల గిరులు భక్తులతో కిక్కిరిశాయి. దేశం నలుమూలల నుంచి శ్రీవారి దర్శనం కోసం యాత్రికులు భారీ సంఖ్యలో తరలిరావడంతో కొండపై తీవ్ర రద్దీ నెలకొంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో, క్యూలైన్లు వెలుపలికి విస్తరించాయి. ప్రస్తుతం టోకెన్లు లేని సాధారణ సర్వదర్శనం భక్తులకు శ్రీవారి దర్శనం కోసం సుమారు 20 గంటల సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మిగతా..2లో

## సమస్యలు గాలికొదిలేసి దేనికి ఈ సంబరాలు? రేవంత్ సర్కార్‌పై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం



- వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- సమస్యలను గాలికొదిలేసి వేడుకలు జరుపుకుంటున్నారంటూ హరీశ్ విమర్శ
- ప్రభుత్వం కుంభకోణాలమయం అయిందని ఆరోపణ

హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలన వేడుకలను జరుపుకోవడంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ముఖం పెట్టుకుని సంబరాలు చేసుకుంటోందని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల తీరు 'ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే' అన్న చందంగా తయారైందని ఎద్దేవా చేశారు. మిగతా..2లో

## కేబినెట్ విస్తరణపై మహేశ్‌కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు



- ఢిల్లీ పర్యటనలో విస్తరణపై చర్చ జరగలేదన్న పీసీసీ చీఫ్
- కొండా సురేఖ బర్తరఫ్ ఏఐసీసీ నిర్ణయమని స్పష్టీకరణ
- కేబినెట్ విస్తరణకు హైకమాండ్ నుంచి సమాచారం లేదని వెల్లడి
- విస్తరణ ఎప్పుడు చేయాలనేది సీఎం నిర్ణయమన్న మహేశ్

హైదరాబాద్ : కొండా సురేఖను మంత్రి వర్గం నుంచి తప్పించిన నేపథ్యంలో తెలంగాణ కేబినెట్ విస్తరణపై

# హైదరాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ రూ.70 వేల కోట్ల పెట్టుబడి!

- హైదరాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుచేయనున్న టీసీఎస్ అనుబంధ సంస్థ హైపర్ వాల్ట్ 7 వేల మందికి ఉపాధి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కీలక సమావేశం
- టీసీఎస్ హైపర్‌వాల్ట్ ప్రతినిధుల బృందంతో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్: హైదరాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ ను ఏర్పాటు చేయనున్నట్లు టీసీఎస్ అనుబంధ సంస్థ హైపర్ వాల్ట్ ప్రకటించింది. అందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సచివాలయంలో టీసీఎస్ హైపర్ వాల్ట్ ప్రతినిధుల బృందం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో శనివారం సమావేశమైంది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతోపాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. టీసీఎస్ సీఈఓ కె.కృతివాసన్, సీవోవో ఆర్తి సుబ్రమణియన్, హైపర్ వాల్ట్ ప్రెసిడెంట్ వి.రాజన్న, హైపర్ వాల్ట్ సీఈఓ, ఎండీ దీపేష్ నందా సమావేశంలో పాల్గొన్నారు. అమెరికా నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓపెన్ ఏఐ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ఉదయ్ రుద్రరాజు సమావేశంలో పాల్గొన్నారు. రూ.70వేల కోట్ల పెట్టుబడి! : హైదరాబాద్‌లో 250 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో 1 గిగావాట్ (1,000 మెగావాట్లు) సామర్థ్యంతో ఈ అత్యాధునిక ఏఐ డేటా సెంటర్ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు. మిగతా..2లో

## కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి



- వెయ్యి రోజులుగా సభకు రాకుండా జీతం తీసుకుంటున్నారని ఆరోపణ
- కేసీఆర్ వైఖరికి నిరసనగా 6న ఇందిరా పార్క్ వద్ద కాంగ్రెస్ మహా ధర్నా
- ధర్నాలో కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనను వివరిస్తామన్న మంత్రులు
- సన్నాహక సమావేశంలో పాల్గొన్న మంత్రులు పొన్నం, శ్రీధర్ బాబు

అనంత సూర్య తెలుగువార్త



మొదటి పేజి తరువాయి

## తిరుమలలో భక్తుల వెల్లువ.. దర్శనానికి 20 గంటల నిరీక్షణ

కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో భక్తులు కాలినడక మార్గాలు, బయట రింగు రోడ్డు వరకు ఉన్న క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టీటీడీ అధికారులు నిరంతరం పాలు, తాగునీరు, అల్పాహారం అందజేస్తూ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఇక శుక్రవారం ఒక్కరోజే 68,374 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 35,241 మంది తలనీలాలు సమర్పించారు. హుండీ ద్వారా రూ.4.03 కోట్ల ఆదాయం లభించినట్లు టీటీడీ వెల్లడించింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని వృద్ధులు, చంటి పిల్లల తల్లిదండ్రులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తమ ప్రయాణాన్ని, దర్శనాన్ని తగిన జాగ్రత్తలతో ప్లాన్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

## కర్నూలులో రూ.2 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి టీజీ భరత్ శంకుస్థాపన

యార్డులో 30 నుంచి 40 వరకు కొత్త షాపులు నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆయన వెల్లడించారు. రైతుల కృషి వల్లే ఈ ఏడాది మార్కెట్ యార్డు ఆదాయం రూ. 8 కోట్లకు పెరిగిందన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గతంలో ఉల్లిధరలు పడిపోయిన సమయంలో సీఎం చంద్రబాబు వెంటనే స్పందించి రైతులకు అండగా నిలిచిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కర్నూలు నగరంలో నెలకొన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని మంత్రి భరత్ అన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లుతున్నారన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు.

**మట్టి విగ్రహాలను పూజించాలని విజ్ఞప్తి..**

వినాయక చవితి నేపథ్యంలో ప్రజలు ప్రకృతిని, పర్యావరణాన్ని, ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వానికి సహకరించాలని మంత్రి భరత్ కోరారు. కేసీ కెనాల్, సుంకేసులలో నీటి లభ్యత లేని కారణంగా పెద్ద విగ్రహాలు పెడితే నిమజ్జనం చేయడంలో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోందన్నారు. నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని చిన్నచిన్న వినాయక విగ్రహాలను మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. అంతేకాకుండా పర్యావరణానికి హాని చేకూరని విధంగా మట్టివిగ్రహాలను పూజించాలని మంత్రి సూచించారు.

## రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటున్నట్టు అయ్యన్న ప్రకటన

వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోనని స్పష్టం చేశారు. నర్సీపట్నంలో జరిగిన తన జన్మదిన వేడుకల సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వయసు పైబడటం వల్ల విశ్రాంతి తీసుకోవాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపిన అయ్యన్న, అసెంబ్లీ స్పీకర్‌గా తనకు మిగిలి ఉన్న మూడేళ్ల పదవీకాలంలో నియోజకవర్గంలో పనులు, అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయడానికి ప్రాధాన్యమిస్తానని ప్రకటించారు. గత 31 ఏళ్లుగా తన పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించే సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నామన్నారు. మరోవైపు, రేపు (సెప్టెంబరు 6) నర్సీపట్నంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో 'బీసీ ఐక్య వేదిక సదస్సు' నిర్వహించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లు కల్పించి విద్య, ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇస్తుంటే, వైసీపీ మాత్రం బీసీల హక్కులపై రాజకీయం చేస్తూ కుట్రలు పన్నుతోందని టీడీపీ నేతలు మండిపడ్డారు. వైసీపీ కుట్రలను తిప్పికొట్టేందుకు బీసీ వర్గాలన్నీ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

## సమస్యలు గాలికొదిలేసి దేనికి ఈ సంబరాలు? రేవంత్ సర్కార్‌పై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం

రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాగిస్తున్న పరిపాలనా విధానాన్ని, ఆయన పనితీరును ప్రజలు తీవ్రంగా అసహ్యించుకుంటున్నారని మండిపడ్డారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కుంభకోణాలమయంగా మారిపోయిందని హరీశ్ రావు ఆరోపించారు. హామీలు నెరవేర్చడంలో విఫలమైన రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని తాము డిమాండ్ చేస్తుంటే, బాధ్యతారాహిత్యంగా కేసీఆర్ రాజీనామా చేయాలనడం విడ్డూరంగా ఉందన్నారు. రాజీనామా చేయాల్సింది కేసీఆర్ కాదని, ప్రజలను మోసం చేసిన రేవంత్ రెడ్డేనని తేల్చిచెప్పారు. విద్యార్థులు, నిరుద్యోగుల ఆవేదన, జీఓ 97 రద్దు, రైతాంగానికి నమ్మకమైన ఉచిత విద్యుత్ సరఫరా వంటి కీలక ప్రజా సమస్యలే ఎజెండాగా రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ గళమెత్తుతుందని తెలిపారు. సభలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకు అధినేత కేసీఆర్ బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో పూర్తి దిశానిర్దేశం చేస్తారని హరీశ్ రావు స్పష్టం చేశారు.

## జెలెన్‌స్కీ కాల్పుల విరమణ ప్రతిపాదన.. కీవ్‌పై 3 రోజులు దాడులు చేయబోమన్న పుతిన్..

అదే సమయంలో రష్యా కూడా దాడులను నిలిపివేయాలని కోరారు. ఇరు దేశాలు కనీసం చర్చలు జరిగేంత సమయం పాటు దాడులు ఆపితే.. శాంతి చర్చలకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు జెలెన్‌స్కీ ప్రతిపాదన తర్వాత రష్యా అధ్యక్షుడు పుతిన్ కీవ్‌పై మూడు రోజుల పాటు దాడులు నిలిపివేయాలని ఆదేశించినట్లు క్రెమ్లిన్ ప్రకటించింది. ఈ తాత్కాలిక విరామం శనివారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమవుతుందని రష్యా తెలిపింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు అమెరికా మరోసారి చర్చలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తోంది. అందులో భాగంగా ట్రంప్ ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్ మాస్కోకు వెళ్లారు. అక్కడ రష్యా అధికారులతో చర్చించిన అనంతరం కీవ్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సమావేశం కానున్నారు యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా వద్ద ఒక కొత్త శాంతి ప్రతిపాదన ఉందని ట్రంప్ ఇప్పటికే వెల్లడించారు . ఇటీవల పుతిన్ కూడా రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే శాంతి ఒప్పందానికి అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. అమెరికా, చైనా సహా పలు దేశాలు శాంతి పరిష్కారానికి మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాయని ఆయన చెప్పారు. అయితే చివరకు సమస్యను పరిష్కరించాల్సింది మాత్రం రష్యా, ఉక్రెయిన్‌లేనని స్పష్టం చేశారు.

## ఉపాధ్యాయుల కంటతడి ఏ దేశానికి, ఏ రాష్ట్రానికి మంచిది కాదు

కాంగ్రెస్ పాలకులు తక్షణమే గ్రహించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ అర్ధాకలితో అలమటిస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న గురువులందరికీ శుభాకాంక్షలు తెలిపుతున్నానని అన్నారు. రాష్ట్రంలో పీఆర్సీ అమలు కాకపోయినా, డీఏలు ఇవ్వకపోయినా ఓర్పుతో ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారని కొనియాడారు. బడినే సర్వస్వంగా భావించి కొవ్వొత్తిలా కరిగిన రిటైర్డ్ టీచర్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాక మలిసంధ్యలో ఆఫీసుల చుట్టూ కాళ్లకు చెప్పులరిగేలా తిరగడం అత్యంత విచారకరమన్నారు. స్వయంగా ముఖ్యమంత్రే విద్యాశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నప్పటికీ ఉపాధ్యాయుల కనీస సమస్యలు కూడా పరిష్కారానికి నోచుకోకపోవడం శోచనీయమని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా గురువులకు ఉచిత హామీల పాఠాలు చెప్పడం మానేసి, వారి సమస్యలను పరిష్కరించడం అనే ప్రాథమిక పాఠాన్ని నేర్చుకోవాలని ఎద్దేవా చేశారు. టీచర్స్ డే రోజైనా ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు, సమస్యల పరిష్కారంపై స్పష్టమైన హామీ ఇవ్వడమే ఆ ఉపాధ్యాయ లోకానికి ఇచ్చే నిజమైన గౌరవమని బండి సంజయ్ స్పష్టం చేశారు.

## మీడియా రంగం విశ్వసనీయత కోల్పోతోంది'

**మీడియా రంగంలో విశ్వసనీయత సంక్షోభం సమస్య మరింత తీవ్రమైందని నితిన్ గడ్కరీ వ్యాఖ్యలు- ప్రజాస్వామ్య పురోగతికి స్వతంత్ర మీడియా ఎంతో ముఖ్యమని కామెంట్స్- ప్రజలు, సమాజం కోసం పనిచేస్తే క్రెడిబిలిటీ తిరిగి సాధించొచ్చని సూచనలు**

ఢిల్లీ : ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర ఎంతో కీలకమని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. అయితే ప్రస్తుతం విశ్వసనీయత సంక్షోభం మీడియా రంగం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యగా మారిందని వ్యాఖ్యానించారు. అన్ని రంగాల్లోనూ క్రెడిబిలిటీ తగ్గుతున్నప్పటికీ, మీడియా రంగంలోనే ఈ సమస్య మరింత తీవ్రంగా కనిపిస్తోందని స్పష్టం చేశారు. నాగ్‌పూర్‌లో జరిగిన ఐఐఎం నాగ్‌పూర్ మీడియా కాన్‌క్లేవ్ 2026లో 'మీడియా, లీడర్‌షిప్ అండ్ ది న్యూ వరల్డ్ ఆర్డర్' అనే థీమ్‌తో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన గడ్కరీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (గ్రూ×) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఎడిటర్ ఇన్ చీఫ్ విజయ్ జోషి, బిజినెస్ స్టాండర్డ్ ఎడిటోరియల్ డైరెక్టర్ ఏకే భట్టాచార్య, బ్లిట్జ్ ఇండియా మీడియా గ్రూప్ ఛైర్మన్, ఎడిటర్ ఇన్ చీఫ్ దీపక్ ద్వివేది తదితరులు హాజరయ్యారు.

**ప్రజాస్వామ్యానికి మీడియా, న్యాయవ్యవస్థ కీలకం**

భారత్ ప్రజాస్వామ్యానికి తల్లి లాంటిదని, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని గడ్కరీ అన్నారు. ప్రజాస్వామ్యంలో మంచి మార్పు రావాలంటే దాని కీలక వ్యవస్థలు సమర్థంగా పనిచేయాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. రాజ్యాంగం ప్రకారం ప్రజాస్వామ్యంలోని నాలుగు స్తంభాలైన శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయవ్యవస్థ, మీడియా తమ బాధ్యతల్ని చక్కగా నిర్వర్తించాలి. ప్రజాస్వామ్యం పురోగతికి, అభివృద్ధికి స్వతంత్ర, నిష్పక్షపాత న్యాయవ్యవస్థతో పాటు స్వతంత్ర మీడియా కూడా అవసరమని అప్పుడే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని గడ్కరీ పేర్కొన్నారు.

# కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి

మొదటి పేజి తరువాయి

హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి తక్షణమే రాజీనామా చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధిగా తన బాధ్యతలు నిర్వర్తించని వ్యక్తి ఆ పదవిలో కొనసాగడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయమై ఈ నెల 6న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద 'మహా ధర్నా' నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ ధర్నాకు సంబంధించిన సన్నాహక సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ



సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రానికి వందేళ్ల నష్టం వాటిల్లిందని విమర్శించారు. "వెయ్యి రోజులుగా ఎమ్మెల్యేగా వేతనం తీసుకుంటున్న కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని, కనీసం తన నియోజకవర్గ ప్రజలకు కూడా అందుబాటులో ఉండటం లేదు. ప్రతిపక్ష నేతగా ఆయన పూర్తిగా విఫలమయ్యారు" అని ఆరోపించారు. కేసీఆర్ వైఖరిని ప్రజల దృష్టికి తీసుకెళ్లడానికే ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నామని మంత్రి స్పష్టం చేశారు. ఇదే వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామని ఆయన తెలిపారు. ఈ మహా ధర్నాను విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

# హైదరాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ - రూ.70 వేల కోట్లు పెట్టుబడి!

మొదటి పేజి తరువాయి

హైపర్ వాల్ట్ తోపాటు భాగస్వామ్య సంస్థలు ఈ ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణకు దాదాపు రూ.70 వేల కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్టుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 7 వేల ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయి. ప్రపంచంలోని అగ్రశ్రేణి ఏఐ కంపెనీలు, హైపర్‌స్కేలర్లు, గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్‌కు అవసరమైన భారీ కంప్యూటింగ్ మౌలిక వసతులను ఈ క్యాంపస్ అందించనుంది. అధిక సామర్థ్యమున్న కంప్యూటింగ్ వ్యవస్థలు, లిక్విడ్ కూలింగ్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దనున్నారు. దేశంలోని అత్యంత అధునాతన, అతిపెద్ద ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ క్యాంపస్‌లలో ఇది ఒకటిగా నిలవనుంది. దేశానికే ఇది చారిత్రాత్మక ప్రాజెక్టు : తెలంగాణకే కాకుండా దేశానికి ఇది చారిత్రాత్మక ప్రాజెక్టు అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఏఐ విప్లవంలో హైదరాబాద్ ప్రపంచస్థాయిలో అగ్రగామిగా ఎదుగుతోందని అభిప్రాయపడ్డారు. ఏఐ మోడల్స్, కంప్యూటింగ్ సామర్థ్యం భవిష్యత్తులో కీలక ప్రజా మౌలిక వసతులుగా మారనున్న తరుణంలో ఆ సామర్థ్యం తెలంగాణలోనే అందుబాటులో ఉండటం రాష్ట్రానికి గొప్ప ప్రయోజనమని పేర్కొన్నారు. తెలంగాణలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన టీసీఎస్ ప్రతినిధులను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు. ప్రభుత్వం తరపున తగిన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. టీసీఎస్ తీసుకున్న ఈ నిర్ణయంతో తన కల నెరవేరిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ఆశించిన విధంగా ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి బలమైన పునాది పడిందన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్-2047 ప్రకారం 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని సాధించే దిశగా ఈ ప్రాజెక్టు కీలక ముందడుగు అని అభివర్ణించారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా : ఈ భారీ పెట్టుబడి ద్వారా ఏఐ, డేటా సెంటర్ల రంగంతోపాటు విద్యుత్, కూలింగ్, నెట్‌వర్కింగ్, నిర్మాణం, ఇంజినీరింగ్, ఆపరేషన్స్ వంటి అనుబంధ రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. పర్యావరణానికి అనుకూలంగా గ్రీన్ ఎనర్జీ, వాటర్-న్యూట్రల్ డిజైన్‌తో ఈ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన చర్చలకు 2026 జనవరిలో దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టాటా సన్స్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ మధ్య జరిగిన సమావేశం నాంది పలికింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం, టీసీఎస్ ప్రతినిధులతో పలుమార్లు చర్చలు జరిపి కొద్ది నెలల్లోనే ప్రాజెక్టును కార్యరూపంలోకి తీసుకొచ్చాయి. దేశంలోని మరో ఐదు



రాష్ట్రాల నుంచి పోటీ ఉన్నప్పటికీ తెలంగాణ ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును సాధించింది. ఈ ప్రాజెక్టుతో హైదరాబాద్‌ను గ్లోబల్ ఏఐ, డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యం మరింత చేరువైంది. ఈ కీలక సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ బి.అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ ఎండీ కె. శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణాదిత్య, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ నిఖిల్ చక్రవర్తి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కేబినెట్ విస్తరణపై మహేశ్‌కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు

మొదటి పేజి తరువాయి

జోరుగా చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇవాళ మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడిన ఆయన.. ప్రస్తుతం కేబినెట్ విస్తరణపై ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. ఇటీవల తాను ఢిల్లీ వెళ్లినప్పుడు మంత్రివర్గ విస్తరణ అంశం ప్రస్తావనకు రాలేదన్నారు. కొండా సురేఖ, చిన్నారెడ్డికి సంబంధించిన అంశాలపైనే అధిష్ఠానంతో చర్చ జరిగిందని తెలిపారు. కొండా సురేఖను మంత్రి వర్గం నుంచి తప్పించడం పూర్తిగా ఏఐసీసీ నిర్ణయమని మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. ఆమెపై చర్యలు తీసుకోకుండా ఆపేందుకు ప్రయత్నించినా..



ఏఐసీసీ ఈ విషయంలో సీరియస్‌గా ఉండటంతో నిర్ణయం జరిగిపోయిందన్నారు.

**ఇప్పట్లో విస్తరణ లేనట్లే!**

ప్రస్తుతం కేబినెట్ విస్తరణకు సంబంధించి హైకమాండ్ నుంచి తమకు ఎలాంటి సమాచారం లేదని పీసీసీ చీఫ్ తెలిపారు. రాష్ట్రంలో మంత్రివర్గాన్ని ఎప్పుడు విస్తరించాలనేది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయిస్తారని స్పష్టం చేశారు. తనకు మంత్రి పదవి దక్కుతుందంటూ జరుగుతున్న ప్రచారంపైనా మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు. ఈ వార్తలపై తనకు ఎలాంటి సమాచారం లేదని తేల్చిచెప్పారు. దీంతో కొండా సురేఖ స్థానంలో ఎవరికి అవకాశం దక్కుతుందన్న చర్చకు ఇప్పటికైతే స్పష్టత రాలేదు.

# 12వ పీఆర్‌సీ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు అంగీకారం - సంబరాల్లో ఉద్యోగ సంఘాలు

మొదటి పేజి తరువాయి

అక్టోబర్ 1 నుంచి చెల్లించడంతో పాటు పీఆర్ సీ ఛైర్మన్ నియామకానికి సీఎం అంగీకరించారు. ఒక సరెండర్ లీవ్, పోలీసులకు అదనంగా మరో సరెండర్ లీవ్ బకాయిల చెల్లింపునకు సరేనన్నారు. పెన్షనర్లకు అదనపు క్వాంటం ఆఫ్ పెన్షన్, ఉద్యోగుల హెల్త్ స్కీమ్‌ను క్రమబద్ధీకరించేందుకు నిర్ణయాలు తీసుకున్నారు. సీఎం నిర్ణయాల పట్ల ఉద్యోగ సంఘాల నేతలు ధన్యవాదాలు తెలియజేశాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గుర్తింపు పొందిన 11 ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ఉండవల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని భేటీలో ఉద్యోగ సంఘాల నేతలకు సీఎం వివరించారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందన్న సీఎం గత రెండేళ్లలో ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరించారు. ఆర్థికంగా అనేక సవాళ్లు ఉన్న నేపథ్యంలో ఉద్యోగులు సంయమనం పాటించాలని చంద్రబాబు కోరారు. అయితే ప్రభుత్వం తీసుకున్న చర్యలతో రిటైర్డ్ ఉద్యోగులకు లబ్ధి కలిగిందన్న ఉద్యోగ సంఘాల నేతలు సాధారణ ఉద్యోగులకు ఆశించిన స్థాయిలో ప్రయోజనాలు అందలేదని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. డిమాండ్లు - సానుకూల స్పందన: దీనిపై సానుకూలంగా స్పందించిన సీఎం ఉద్యోగుల వేతన సవరణకు సంబంధించి 12వ పీసీఆర్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఛైర్మన్‌ను త్వరలో నియమిస్తామని తెలిపారు. 2024 జూలై 1, 2025 జనవరి 1 నుంచి పెండింగ్‌లో ఉన్న రెండు డిఏ లను అక్టోబర్ 1, 2026 నుంచి చెల్లించేందుకు అంగీకరించారు. 2022 సంవత్సరానికి సంబంధించిన సరెండర్ లీవ్ నగదును వచ్చే సంక్రాంతికి చెల్లించడంతోపాటు పోలీసు సిబ్బందికి అదనంగా మరో సరెండర్ లీవ్‌ను అక్టోబర్ నుంచి చెల్లించేందుకు ముఖ్యమంత్రి సరేనన్నారు. అయితే పీసీఆర్ ఏర్పాటు చేసేలోగా ఐఆర్ ఇవ్వాలని ఉద్యోగ సంఘాల నేతలు కోరగా కచ్చితంగా ఇస్తామని, అందుకు కొంత సమయం కావాలని చంద్రబాబు కోరారు. పెన్షనర్లకు అదనపు క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 70 ఏళ్లు దాటిన వారికి 10 శాతం, 75 ఏళ్లు దాటిన వారికి 15 శాతం అదనపు పెన్షన్ క్వాంటమ్‌ను 2027 జనవరి నుంచి అమలు చేస్తారు. ఆరోగ్య పథకంలో ఉద్యోగులు కోరిన మార్పును సీఎం అంగీకరించారు. 'సీఎం చంద్రబాబుతో ఉద్యోగ సంఘాల సమావేశం మంచి వాతావరణంలో జరిగింది. పీఆర్సీతో పాటు రెండు డీఏలు, ఒక సరెండర్ లీవ్ (పోలీసులకు అదనంగా మరొకటి), రిటైరైనవారికి అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ రీస్టోరేషన్, ఈహెచ్ఎస్ బకాయిలు ప్రతి నెలా ఒకటో తేదీన ట్రస్ట్‌కి చెల్లింపు తదితర సమస్యల పరిష్కారానికి సీఎం హామీ ఇచ్చారు. ఉద్యోగుల పట్ల సానుకూలంగా ఉండాలని మేం కోరాం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఐఆర్ విషయంపై కొంత సమయం ఇవ్వాలని సీఎం చెప్పారు. ' -సూర్యనారాయణ, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సీపీఎస్ కు శాశ్వత పరిష్కారం: ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని ఉద్యోగ సంఘాలు కోరాయి. ఈ అంశాన్ని కూడా త్వరలో పరిష్కరిస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు నేతలు తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలపైనా చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. సచివాలయ ఉద్యోగులకు ఇళ్ల స్థలాల అంశాన్ని త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పెండింగ్ బిల్లుల చెల్లింపుతో పాటు సీపీఎస్ కు ఆమోదయోగ్యమైన శాశ్వత పరిష్కారం



కల్పించాలని కోరారు.ప్రభుత్వ నిర్ణయాలపై ఆదివారం రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించి ఎలా ముందుకెళ్లాలనే అంశంపై చర్చిస్తామని బొప్పరాజు తెలిపారు. తెలంగాణలో పనిచేస్తున్న ఏపీ ఉద్యోగులు, ఏపీలో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగుల బదిలీకి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని సమావేశంలో సీఎం చెప్పారని ఏపీటీఎఫ్ నేతలు తెలిపారు. ఇన్ సర్వీసు టీచర్లకు టెట్ విషయంలోనూ సానుకూల నిర్ణయం ఉంటుందని చెప్పారని వెల్లడించారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచేందుకు ఉన్న వెసులుబాటుపై ఆలోచించాలని సీఎస్‌ను చంద్రబాబు ఆదేశించారని చెప్పారు. వివాదం: సీఎంతో సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడే క్రమంలో ఉద్యోగ సంఘాల నేతల మధ్య పోటీ నెలకొనడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఒకరిపై ఒకరు నినాదాలు చేసుకోవడంతో పరిస్థితి పరస్పరం తోపులాట వరకు వెళ్లింది. పోలీసులు వెంటనే జోక్యం చేసుకున్నారు. ఉద్యోగ సంఘాల నేతలు కూడా సమన్వయం చేసుకుని వివాదాన్ని సద్దుమణిగేలా చేశారు.

# విద్యార్థుల్లో డ్రగ్స్, స్క్రీన్ టైం విషయంలో అప్రమత్తంగా ఉండాలి'

మొదటి పేజి తరువాయి

"ఉపాధ్యాయులు పుస్తకాలు, సిలబస్‌కే పరిమితం కాకుండా విద్యార్థుల జీవితాల్లో భాగం కావాలి. పిల్లల్లో సహజంగా ఉండే ఆసక్తి, తెలుసుకోవాలనే కుతూహలాన్ని గుర్తించి దాన్ని సరైన దిశలో మళ్లించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది. పిల్లల బాల్యాన్ని కోల్పోకుండా చూడటం ఉపాధ్యాయులు చేయగలిగే అతిపెద్ద సేవ. తరగతి గదిలో పాఠాలను మరింత ఆసక్తికరంగా మార్చేందుకు సృజనాత్మక పద్ధతులను అనుసరించాలి. విద్యార్థుల అకడమిక్ పనితీరును మాత్రమే ప్రామాణికంగా తీసుకోకూడదు. పిల్లల ప్రవర్తనలో ఏవైనా అసాధారణ మార్పులు కనిపిస్తున్నాయా? వారి రోజువారీ జీవితం ఎలా ఉంది? అనే విషయాలను ఉపాధ్యాయులు నిశితంగా గమనించాలి. గతంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో పిల్లలపై తల్లిదండ్రులతో పాటు ఇతర కుటుంబసభ్యుల పర్యవేక్షణ కూడా ఉండేది. ప్రస్తుతం ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోతున్న నేపథ్యంలో విద్యార్థుల జీవితాల్లో ఉపాధ్యాయుల పాత్ర మరింత పెరిగింది."

**నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి**

**డ్రగ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి**

కొన్ని పెద్ద నగరాలు, విశ్వవిద్యాలయాల్లో మాదకద్రవ్యాల సమస్యను గుర్తించడం కష్టంగా మారుతోందని మోదీ అన్నారు. ఎవరు ఎవరికి ఏం ఇస్తున్నారో తెలుసుకోవడం కూడా కష్టమైన పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉపాధ్యాయులే డ్రగ్స్ దుష్ప్రభావాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ముందుకు రావాలని సూచించారు. అదే సమయంలో ఏ విద్యార్థి ప్రవర్తనలోనైనా ఆకస్మిక మార్పులు కనిపిస్తే వాటిని నిర్లక్ష్యం చేయకుండా నిశితంగా పరిశీలించాలని చెప్పారు.

**'మొబైల్ వినియోగానికి క్రీడలే పరిష్కారం'**

విద్యార్థుల్లో అధిక స్క్రీన్ టైమ్ మరో ప్రధాన సమస్యగా మారిందని



ప్రధాని పేర్కొన్నారు. పిల్లలు రోజులో ఎంతసేపు మొబైల్, ఇతర స్క్రీన్లను చూస్తున్నారు? రాత్రివేళల్లోనూ ఫోన్లు ఉపయోగిస్తున్నారా? అనే విషయాలను తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు చర్చించాలని సూచించారు. స్క్రీన్ టైమ్‌ను తగ్గించేందుకు కేవలం ఆంక్షలు విధించడం కంటే పిల్లల్లో క్రీడలు, శారీరక ఆటలు, సృజనాత్మక కార్యకలాపాలపై ఆసక్తి పెంచడం ద్వారా సహజంగానే మొబైల్ వినియోగాన్ని తగ్గించవచ్చని మోదీ అన్నారు. జాతీయ విద్యా విధానం (ఎన్ ఈపీ)ను ప్రస్తావించిన ప్రధాని పిల్లలను తరగతి గదికే పరిమితం చేయకూడదని అన్నారు. నిజ జీవిత నైపుణ్యాలు, వివిధ రకాల పనులు, సమాజంతో వారికి పరిచయం కల్పించాలని సూచించారు. విద్య కేవలం పుస్తకాల్లోని విషయాలకు పరిమితం కాకుండా జీవితాన్ని అర్థం చేసుకునేలా ఉండాలని పేర్కొన్నారు.

**మహిళల్లో క్యాన్సర్ అవగాహనపై ప్రశంస**

తన పరిసర ప్రాంతాల్లో మహిళలకు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న ఓ ఉపాధ్యాయురాలి ప్రయత్నాన్ని ప్రధాని ప్రత్యేకంగా ప్రశంసించారు. తన లోక్‌సభ నియోజకవర్గమైన వారణాసిలో తాను రొమ్ము క్యాన్సర్ అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. ఎక్కువ మంది మహిళలు స్క్రీనింగ్ కోసం ముందుకు వస్తున్నారని, ఈ కార్యక్రమంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు కూడా నమోదైనట్లు మోదీ తెలిపారు.

**82 మంది ఉపాధ్యాయులకు జాతీయ పురస్కారాలు**

ఈ ఏడాది జాతీయ ఉపాధ్యాయ పురస్కారాలకు మొత్తం 82 మంది ఉపాధ్యాయులు, విద్యావేత్తలు ఎంపికయ్యారు. ఇందులో పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం నుంచి 48 మంది, ఉన్నత విద్యా సంస్థలు, పాలిటెక్నిక్ ల నుంచి 21 మంది, నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖకు చెందిన 13 మంది స్కిల్ ట్రైనర్లు ఉన్నారు.

# 12 గంటలలోపే ముగ్గురు మహిళల ఆచూకీ కనిపెట్టిన మూడో పట్టణ పోలీసులు



అనంత క్రైమ్, సెప్టెంబర్ 05:( అనంత సూర్య ): ఎస్పీ ఆదేశాలతో వేగంగా స్పందించిన సీఐ కౌలుట్లయ్య బృందం. 9 నెలల గర్భిణితో పాటు మరో ఇద్దరు మహిళలను క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగింత. మహిళల అదృశ్యం, కుటుంబ సభ్యుల ఆందోళనకు సంబంధించిన మూడు వేర్వేరు ఘటనల్లో మూడో పట్టణ పోలీసులు వేగంగా స్పందించి, పోలీసు శాఖ మహిళల భద్రతకు పెద్దపీట ఏవిధంగా వేస్తుందో ఇదే ఉదాహరణగా చెప్పుకునేలా త్రీ టౌన్ సిఐ కౌలుట్లయ్య పోలీసులు శరవేగంగా స్పందించి చేదించగలగడమే నిదర్శనం. 12 గంటల వ్యవధిలో ముగ్గురు మహిళలను గుర్తించి క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ చర్యల్లో మూడో పట్టణ సీఐ కౌలుట్లయ్య సమయస్ఫూర్తి సమన్వయంతో పోలీసు బృందం వ్యవహరించిన తీరు కీలకంగా నిలిచింది. భర్తతో మనస్పర్థల నేపథ్యంలో 9 నెలల గర్భవతి అయిన ఓ మహిళ నిన్న రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యుల నుంచి సమాచారం అందిన వెంటనే పోలీసులు గాలింపు చర్యలు ప్రారంభించారు. ఆమె రైల్వే మార్గంలో వెళ్లి ఉ ండవచ్చనే సమాచారంతో అనంతపురం రైల్వే పోలీసులతో పాటు తిరుపతి రైల్వే పోలీసులను కూడా అప్రమత్తం చేశారు. సంబంధిత సమాచారాన్ని వివిధ విభాగాలతో సమన్వయం చేసుకుంటూ పోలీసులు మూడు గంటల్లోనే ఆమెను గుర్తించి క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇదే సమయంలో మరో ఇద్దరు మహిళలు కూడా కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా వెళ్లిపోయారు. వారిలో ఒకరు తెల్లవారుజామున తల్లిదండ్రులకు తెలియకుండా ఇంటి నుంచి వెళ్లిపోగా, మరో మహిళ అనంతపురం ఆర్టీసీ బస్టాండులో కనిపించకుండా పోయింది. ఈ రెండు ఘటనల్లోనూ ఫిర్యాదులు అందిన వెంటనే పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి రెండు గంటల్లోనే వారి ఆచూకీ గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన ఫ్రెండ్లీ పోలీసులు తమ కుటుంబ సభ్యులు కనిపించడం లేదంటూ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధిత కుటుంబాల ఫిర్యాదులను పోలీసులు ఫ్రెండ్లీ పోలీసింగ్ పద్ధతిలో స్వీకరించారు. ఈ సందర్భంగా వారిని కూర్చోబెట్టి వివరాలు తెలుసుకోవడంతో పాటు, పరిస్థితి పై భరోసా కల్పిస్తూ ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంలో స్పందించారు. మహిళల ఆచూకీ కోసం అందుబాటులో ఉన్న సమాచారాన్ని సేకరించి, అవసరమైన పోలీసు విభాగాలతో సమన్వయం చేసుకోవడం ద్వారా గాలింపు చర్యలను వేగవంతం చేశారు. సీఐ కౌలుట్లయ్య సమయస్ఫూర్తి సమన్వయం ఈ మూడు ఘటనల్లోనూ సీఐ కౌలుట్లయ్య సమయస్ఫూర్తి సమన్వయం, తక్షణ స్పందన పోలీసు చర్యలకు దోహదపడింది. ముఖ్యంగా గర్భిణి అదృశ్యమైన ఘటనలో రైల్వే పోలీసులను వెంటనే అప్రమత్తం చేయడం, అందుబాటులో ఉన్న సమాచారంతో గాలింపు చర్యలను సమన్వయం చేయడం ద్వారా ఆమెను త్వరగా గుర్తించగలిగారు. మహిళల అదృశ్యానికి సంబంధించిన ఘటనల్లో సమ-యం కీలకమైన నేపథ్యంలో, ఫిర్యాదు అందిన వెంటనే చర్యలు చేపట్టడం ద్వారా పోలీసులు కుటుంబ సభ్యుల ఆందోళనను తగ్గించగలిగారు. పోలీసుల చర్యలకు కుటుంబ సభ్యుల అభినందనలు ముగ్గురు మహిళలు క్షేమంగా తిరిగి రావడంతో వారి కుటుంబ సభ్యులు ఊరట చెందారు. తక్కువ సమయంలో స్పందించి తమ కుటుంబ సభ్యులను గుర్తించి అప్పగించినందుకు సీఐ కౌలుట్లయ్యతో పాటు పోలీసు సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు మహిళల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పోలీసులు చేపట్టిన ఈ చర్యలను అధికారులు అభినందించారు. సమయానికి స్పందించడం, వివిధ పోలీసు విభాగాలతో సమన్వయం చేసుకోవడం, కుటుంబ సభ్యులకు భరోసా కల్పించడం ప్రజల పై పోలీసులకు ఉన్న నిబద్ధత అని పేర్కొన్నారు.

# పారిశుద్ధ్యంపై కార్పొరేషన్ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు

## ముగ్గురు కార్మికులకు మెమో



అనంత కలెక్టరేట్, సెప్టెంబర్ 05 (అనంత సూర్య) : నగర కమిషనర్ యం. జస్వంత రావు గారు నేడు నగరంలో పారిశుద్ధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాజు రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, సూర్య నగర్, సంగమేశ్ నగర్, కలెక్టరేట్ నుండి బెంగళూరు మెయిన్ రోడ్డు, మున్సిపల్ లిమిట్స్ వరకు, జె ఎన్ టి యు రోడ్డు, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ రోడ్డు, ఆర్ టి ఒ ఆఫీసు రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. పలు చోట్ల పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటం, రోడ్ల ఇరువైపులా, డివైడర్లపై పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడాన్ని గమనించి 6 వ సర్కిల్ శానిటరీ ఇన్స్పెక్టర్, సెక్రటరీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్ టి ఒ కార్యాలయం మెయిన్ రోడ్డు వద్ద విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ హోటల్ వద్ద కాలయాపన చేస్తున్న ముగ్గురు కార్మికులను మందలించి, అర్థ రోజు వేతనం కోత విధిస్తూ మెమో జారీ చేశారు. అనంతరం 4వ సర్కిల్ పరిధిలోని రామచంద్ర నగర్, మహాత్మా గాంధీ కాలనీ, ఎర్రనేల కొట్టాలు, వేణుగోపాల్ నగర్ లలో పర్యటించారు. ప్రతి ఇన్స్పెక్టర్, సెక్రటరీ క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. శ్రీనగర్ కాలనీలో జరుగుతున్న సీసీ డ్రైనేజీ పనులను పరిశీలించి, అడ్డంకులను తొలగించి వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. స్వచ్ఛ అనంతపురం కోసం అందరూ బాధ్యతతో పనిచేయాలని, ప్రజలు రోడ్లపై చెత్త వే-యకుండా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షాకీర్ హుస్సేన్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఓంకార్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ రాజా రవీంద్రనాథ్ చౌదరి, అసిస్టెంట్ ఇంజనీర్ తదితరులు పాల్గొన్నారు.

# అనంత లక్ష్మి కళాశాలలో అవగాహన సదస్సు





అనంత క్రైమ్, సెప్టెంబర్ 05:( అనంత సూర్య ): విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకుని బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని, మాదకద్రవ్యాలు మరియు సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని ఇటుకలపల్లి సి.ఐ హేమంత్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఇటుకలపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని అనంత లక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో ఇటుకలపల్లి ఎస్సై, మహిళా పోలీస్ స్టేషన్ (ట్రూ) సీఐతో కలసి ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. కళాశాలల్లో ర్యాగింగ్ పూర్తిగా నిషేధమని, ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మహిళలు, పిల్లలపై జరుగుతున్న నేరాల నివారణకు, అత్యవసర సమయాల్లో రక్షణ పొందేందుకు 'శక్తి యాప్' ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలు, పోక్సో (ఫ్రూజుబూ) చట్టం, బాల్యవివాహాల నిషేధ చట్టాలపై విద్యార్థులకు క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. ఆన్‌లైన్ సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే కింది సహాయక నంబర్లను సంప్రదించాలని సూచించారు : అత్యవసర సహాయం (పోలీస్): 100 / 112, సైబర్ నేరాల ఫిర్యాదుకు: 1930 బాలల సహాయక నంబర్ (చైల్డ్ లైన్): 1098 మహిళల రక్షణ/సహాయం: 1972 ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలోని పలు దేవాలయాల వద్ద పటిష్ట బందోబస్తు



అనంతకలెక్టరేట్, సెప్టెంబర్ 05 : (అనంత సూర్య): పవిత్ర శ్రావణ మాసం ముగింపు శనివారం పుర-స్కరించుకుని జిల్లాలోని పలు దేవాలయాల వద్ద భక్తుల రద్దీ అనుగుణంగా ఆయా పోలీసులు చర్యలు చేపట్టారు. ముఖ్యంగా గుంతకల్లు మండలం కసాపురం ,డి.హీరేహాళ్ మండలం మురడి, ఉరవకొండ మండలం పెన్నహోబిళం, తదితర దేవాలయాల వద్ద భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు ఆయా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పుణ్యక్షేత్రాలకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక లైన్లు, పార్కింగ్ వసతులను పర్యవేక్షించారు. ఆలయ ప్రాంగణంలో పోలీస్ కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసుకుని శాంతిభద్రతల పరిరక్షణతో పాటు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సిబ్బందిని అప్రమత్తం చేశారు. భక్తులందరూ పోలీసుల సూచనలు పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో దైవదర్శనం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయా పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# గొర్రెల దొంగల ముఠా గుట్టురట్టు...

## ఇద్దరు నిందితుల అరెస్ట్ - సీఐ వెంకటేసులు



రాప్తాడు, సెప్టెంబర్ 05 (అనంత సూర్య): మండలంలోని లింగనపల్లి గ్రామంలో మందలోని గొర్రెల పిల్లలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్తుండగా అడ్డుకోబోయిన వారిపై దాడులకు దిగిన ముఠాను రాప్తాడు పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెంకటేసులు తెలిపారు. శనివారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. లింగనపల్లిలో 10 గొర్రె పిల్లలు దొంగతనానికి గురవ్వగా బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. దొంగతనం సమయంలో అడ్డుకోబోయిన గ్రామస్తులతోపాటు, బాధితుడి బంధువుపై నిందితులు రాళ్లతో దాడి చేసి, కత్తులు, రాడ్లతో బెదిరించారన్నారు. అంతేకాకుండా కారుతో తొక్కించి చంపేందుకు యత్నించారన్నారు. బాధితులు అందించిన వాహనం నంబర్, సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అరెస్ట్ అయిన వారిలో నగర పరిధిలోని చంద్రబాబునాయుడు కొట్టాలకు చెందిన సాయి (26), రుద్రంపేట సమీపంలో నివాసముండే చిన్న అలియాస్ రవికుమార్ రెడ్డి ఉన్నారు. సాయిపై గతంలో ఇటుకలపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్ దొంగతనాలు సహా 4-5 కేసులు ఉన్నాయన్నారు. జల్సాలు, మద్యానికి అలవాటు పడిన వీరు వాహనాల్లో తిరుగుతూ ఈ దొంగతనాలకు పాల్పడుతున్నారని సీఐ వివరించారు. ఈ కేసులో రామగిరి మండలం పేరూరుకు చెందిన ధన అలియాస్ ధనుంజయ పరారీలో ఉన్నాడని, అతడు బైక్‌పై 'పోలీస్' అని రాసుకొని బెదిరింపులకు పాల్పడేవాడన్నారు. త్వరలోనే అతడిని కూడా అరెస్ట్ చేస్తామన్నారు. రాత్రిపూట గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే ప్రజలు అప్రమత్తంగా ఉండి డయల్ 112 లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. రాత్రి సమయాల్లో బ్లాకోల్ట్స్, పోలీస్ బీట్ నిరంతరం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ ప్రాంతంలో గంజాయి, అక్రమ పదార్థాల రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచామని, వ్యసనాలకు అలవాటు పడిన వారికి డి-అడిక్షన్ సెంటర్ ద్వారా కౌన్సిలింగ్ ఇప్పిస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా దొంగల ముఠాను పట్టుకున్న పోలీస్ సిబ్బందిని సీఐ అభినందించారు.

# ఉపాధ్యాయులకు సమాజంలో సముచిత గౌరవం కల్పించాం

- ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో ఉపాధ్యాయ వ్యవస్థకు కొత్త గుర్తింపు తెచ్చారు
- అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్
- సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమైనది
- ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ
- పదవ తరగతిలో మరిన్ని మంచి ఫలితాలు సాధించాలి
- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్
- ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



అనంతపురం, సెప్టెంబర్ 5 అనంత సూర్య : గతంలో ఉపాధ్యాయులకు సరైన గౌరవం దక్కలేదని, కానీ గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో ఉపాధ్యాయులకు తిరిగి గౌరవాన్ని, గుర్తింపును తీసుకొచ్చారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. అనంతపురం నగరంలోని ప్రభుత్వ డిగ్రీ (ఆర్ట్స్) కళాశాలలోని డ్రామా హాల్‌లో శనివారం జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో భారతరత్న, భారత ద్వితీయ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం (గురు పూజోత్సవం), జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రధానోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించగా.. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అధ్యక్షత నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎస్టీ కమిషన్ సభ్యులు పి.వెంకటప్ప, ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి, విద్యా శాఖ ఆర్జెడి శామ్యూల్, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు, అర్బన్ బ్యాంకు చైర్మన్ మురళీధర్, రాష్ట్ర లేబర్ అండ్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ వెంకట శివుడు, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల కార్పొరేషన్ చైర్మన్ నారాయణస్వామి, ఆంధ్రప్రదేశ్ రజక సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ పరమ-ేశ్వర్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కమలమ్మ, యాదవ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, పలు శాఖల రాష్ట్ర డైరెక్టర్లు, డిఈఓ అయూబ్ హుస్సేన్, సమగ్ర శిక్ష ఏపిసి శైలజ, ఉత్తమ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 67 మంది ఉపాధ్యాయులకు ఎంపీ, ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీ, తదితరులు ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయుడిగా పని చేసిన చరిత్ర ఆర్ట్స్ కళాశాలకు ఉందన్నారు. అలాంటి చోట గురుపూ-జోత్సవంలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. ఉపాధ్యాయులంటేనే సమాజంలో ఒక గౌరవం అని, అమ్మా నాన్నల తర్వాత ఒక గౌరవం తీసుకొచ్చే వ్యక్తి అని పేర్కొన్నారు. ఐఏఎస్ గానీ, ఒక స్టూడెంట్ గానీ, సుప్రీంకోర్టు జడ్జి గానీ, పొలిటీషియన్ గానీ ఎవరైనా ఉపాధ్యాయుడి శిష్యుడేనన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఉపాధ్యాయులకు ఒక గుర్తింపు తీసుకొచ్చారన్నారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేశారన్నారు. ఉపాధ్యాయులకు సముచిత స్థానం ఇచ్చారన్నారు. టీచర్స్‌కి, స్టూడెంట్‌కి ఒక అనుసంధానంగా, పేరెంట్స్‌కి ఒక అనుసంధానంగా మెగా పిటిఎంలు నిర్వహిస్తున్నారన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉద్యోగాలు కేవలం 148 రోజుల్లోనే భర్తీ చేశా-రన్నారు. గతంలో మధ్యాహ్న భోజనం పాఠశాలల్లోనే ఉండేదని.. కానీ ఇప్పుడు ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం పెడుతున్నారన్నారు. మంత్రి నారా లోకేష్ ప్రోత్సాహంతో ఉపాధ్యాయులు గత ఏడాది కాలంలో బాగా పని చేసిన కారణంగా.. ఒక్క అనంతపురం జిల్లాలోనే దాదాపు 4 వేల మంది ప్రైవేటు విద్యాసంస్థల నుంచి ప్రభుత్వ బడుల్లో చేరారన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో గత 30 ఏళ్ల నుంచి కొన్ని పాఠశాలలు కేవలం 7వ తరగతి వరకే ఉండేవని.. అలాంటి స్కూల్స్ ని మంత్రి నారా లోకేష్ సహకారంతో అప్ గ్రేడ్ చేశామని.. దాని వలన దాదాపు 84 ఉపాధ్యాయులు అదనంగా వచ్చారని తెలిపారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ అనే సూక్తులు ప్రతి వ్యక్తి జీవితంలో అత్యంత కీలకమైనవని, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమైనదని పేర్కొన్నారు. అనాది కాలం నుండి గురువుల శిక్షణలోనే రాజులు, గొప్ప నాయకులు తయారయ్యారని, విజ్ఞానాన్ని అందించి దేశానికి అత్యుత్తమ పౌరులను అందించేది ఉపాధ్యాయు-లేనని కొనియాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు, పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ.. గతేడాది ఉపాధ్యాయుల కృషి వల్ల 10వ తరగతి పరీక్షల్లో పది శాతం ఎక్కువ ఫలితాలు సాధించారని, ప్రత్యేక దృష్టి పెట్టి వచ్చే ఏడాది 90, 95 శాతం ఫలితాలు సాధించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు పెరగడం జరిగిందని, ఉపాధ్యాయులు 30, 35 వేల మంది పిల్లల ఇంటికి వెళ్లడం జరిగిందని, సుమారు 4 వేల మంది విద్యార్థులు ప్రయివేటు నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరడం జరిగిందన్నారు. పబ్లిక్ ఎడ్యుకేషన్ కాపాడడం చాలా ముఖ్యమని, వచ్చే ఏడాది 10 వేల మంది పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు తీసుకురావాలని, పదవ తరగతిలో మరిన్ని మంచి ఫలితాలు సాధించాలని, అందరూ కలిసి పనిచేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో చిన్న చిన్న సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. ఉపాధ్యాయులందరికీ ఉపాధ్యాయ దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్టీ కమిషన్ సభ్యులు పి.వెంకటప్ప, ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు, లేబర్ అండ్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ వెంకట శివుడు మాట్లాడారు. అలాగే జిల్లా విద్యాశాఖాధికారి విద్యా శాఖ పురోగతిని వివరించారు. ఆర్జెడి శామ్యూల్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహిస్తోందన్నారు. అకడమిక్ ఏడాదిలో పండుగ వాతావరణంలో పాఠశాలను నడపాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. అనంతరం చాగంటి కోటేశ్వరరావు రచించిన విలువల విద్య పుస్తకాన్ని జిల్లా కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, తదితరులు ఆవిష్కరణ చేశారు. తదనంతరం ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



# కుందుర్పి కొండ.. ఆంధ్ర అరుణాచలం

- కొండ చుట్టూ పవిత్ర గిరి ప్రదక్షిణలు
- ఎమ్మెల్యే అమిలినేని ఆధ్వర్యంలో 'ఆంధ్రా అరుణాచలం' అభివృద్ధికి మహా సంకల్పం
- 26న ప్రత్యేక ఆధ్యాత్మిక-పర్యావరణ కార్యక్రమం

**అనంతపురం జిల్లాలోని కుందుర్పి కొండకు రోజురోజుకూ ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటోంది. అరుణాచలం తరహాలో కొండ చుట్టూ గిరి ప్రదక్షిణలు చేస్తూ భక్తులు భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకుంటున్నారు. దీంతో కుందుర్పి కొండ మరో పుణ్యక్షేత్రంగా రూపుదిద్దుకుంటుందనే విశ్వాసం భక్తుల్లో వ్యక్తమవుతోంది. కొండను దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. కొండ చుట్టూ పవిత్రంగా గిరి ప్రదక్షిణలు చేస్తూ, మార్గమధ్యంలో దేవతలను స్మరించుకుంటూ మొక్కులు చెల్లించుకుంటున్నారు. అరుణాచలంలో గిరి ప్రదక్షిణకు ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యతను తలపించేలా కుందుర్పి కొండ చుట్టూ భక్తుల సందడి కనిపిస్తోంది. ముఖ్యంగా పౌర్ణమి, ప్రత్యేక పర్వదినాల్లో భక్తుల సంఖ్య మరింత పెరుగుతోంది. కొండ చుట్టూ ప్రదక్షిణ చేయడం ద్వారా తమ కోరికలు నెరవేరుతాయని భక్తులు విశ్వసిస్తున్నారు. ఈ ప్రాంతం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందేందుకు కళ్యాణదుర్గం ఎమ్మెల్యే చొరవ తీసుకుంటున్నారు.**

*అనంతపురం, సెప్టెంబర్ 5 అనంత సూర్య :*

కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిధిలోని కుందుర్పిలో స్వయంభువుగా వెలసిన పవిత్ర కొండను 'ఆంధ్రా అరుణాచలం'గా అభివృద్ధి చేసి, ఆధ్యాత్మికంగా మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావడంతో పాటు ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర సంకల్పించారు. కుందుర్పి పవిత్ర కొండ చుట్టూ నిర్వహిస్తున్న గిరి ప్రదక్షిణ కార్యక్రమానికి ఇప్పటికే విశేష స్పందన లభిస్తోంది. వేలాది మంది భక్తుల భాగస్వామ్యంతో ఇప్పటి వరకు పది గిరి ప్రదక్షిణలు విజయవంతంగా పూర్తయ్యాయి. భక్తి, ఆధ్యాత్మికతతోపాటు పర్యావరణ పరిరక్షణను అనుసంధానం చేస్తూ కొనసాగుతున్న ఈ కార్యక్రమం కుందుర్పికి ప్రత్యేక గుర్తింపును తీసుకొస్తోంది. ఈ నేపథ్యంలో కుందుర్పి ప్రాంత అభివృద్ధికి మరింత ప్రాధాన్యత కల్పించేందుకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర, డిస్కవర్ అనంతపురం అనిల్ కుమార్ కలిసి పని చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా గిరి ప్రదక్షిణలు, మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణ, భక్తులకు అవసరమైన సౌకర్యాల అభివృద్ధి తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర, అనంతపురం అనిల్ కుమార్ శనివారం సంయుక్తంగా విడుదల చేశారు.

### 26న ప్రత్యేక కార్యక్రమం

కుందుర్పి పవిత్ర కొండ సమీపంలో ఈనెల 26న ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని గిరి ప్రదక్షిణతో పాటు మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను స్వీకరించాలని పిలుపునిచ్చారు. కుందుర్పిని కేవలం ఆధ్యాత్మిక క్షేత్రంగా మాత్రమే కాకుండా భక్తి, ప్రకృతి, పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు.

### గిరి ప్రదక్షిణతో పాటు మొక్క నాటే పవిత్ర సంకల్పం

కుందుర్పి పవిత్ర కొండ చుట్టూ భక్తులు చేతిలో ఒక మొక్కను పట్టుకుని భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ చేయాలని కోరుతున్నారు. ప్రదక్షిణ పూర్తయిన అనంతరం ఆ మొక్కను అనువైన ప్రదేశంలో నాటి, కంటికి రెప్పలా సంరక్షించాలి. ఒక భక్తుడు – ఒక మొక్క – ఒక బాధ్యత అనే సంకల్పంతో ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

### మొక్కలోనే వృక్షేశ్వరుని దర్శనం

కాలకూట విషాన్ని తన కంఠంలో దాచుకొని సమస్త లోకాన్ని కాపాడిన నీలకంఠేశ్వరుని తత్వాన్ని ప్రకృతిలోని వృక్షాలతో అనుసంధానం చేస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వృక్షాలు కాలుష్యాన్ని స్వీకరించి మనకు ప్రాణవాయువును అందిస్తూ సమస్త జీవకోటిని కాపాడుతున్నాయి. ఈ నేపథ్యంలో మొక్కను వృక్షేశ్వరునిగా భావించి నాటి, దానిని సంరక్షించడం కూడా శివసేవలో భాగమే అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సంకల్పించారు.

### మొక్కకు నీరు పోయడం – పరమేశ్వరునికి జలాభిషేకం

భక్తులు తమ చేతులతో నాటిన మొక్కకు నిత్యం నీరు పోసి సంరక్షిస్తే, అది సాక్షాత్తూ పరమేశ్వరునికి నిత్యం జలాభిషేకం చేసినట్లుగా భావించవచ్చని నిర్వాహకులు తెలిపారు. తమ పొలాల్లో, ఇళ్ల ఆవరణల్లో, గ్రామ రహదారుల పక్కన, అడవి అంచుల్లో అనువైన ప్రదేశాల్లో మొక్కలను నాటి వాటిని బాధ్యతగా సంరక్షించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

### కుందుర్పి అభివృద్ధికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర ప్రత్యేక చొరవ

కుందుర్పి పవిత్ర కొండకు ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాధాన్యతను మరింత పెంచడంతో పాటు, ఈ ప్రాంత అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టేందుకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. అనంతపురం అనిల్ కుమార్‌తో కలిసి కుందుర్పి అభివృద్ధికి పని చేయాలని నిర్ణయించడం ద్వారా ఈ పవిత్ర క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేసే దిశగా మరో ముందడుగు పడింది. "ఆంధ్రా అరుణాచలం" కుందుర్పిని భక్తి, ప్రకృతి పరిరక్షణ, ఆధ్యాత్మిక చైతన్యానికి నిలయంగా తీర్చిదిద్దడమే లక్ష్యం అని నిర్వాహకులు తెలిపారు. ఈనెల 26న జరిగే ప్రత్యేక కార్యక్రమంలో భక్తులు, ప్రజలు, ఆధ్యాత్మికవేత్తలు, పర్యావరణ ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



## ఘనంగా రాయల్ మురళీ పుట్టినరోజు వేడుకలు

### శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ నేతలు, ప్రముఖులు

**అనంతపురం, సెప్టెంబర్ 5 అనంత సూర్య :** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయల్ మురళి పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు, పుర ప్రముఖులు, అభిమానులు, బంధువుల మధ్య కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. జిల్లా గ్రంధాలయ సంస్థ కార్యాలయంలో చైర్మన్ వడ్డే వెంకట్, నాయకులు కొండవీటి సుధాకర్ నాయుడు, కూచి హరిప్రసాద్ ఆధ్వర్యంలో రాయల్ మురళికి గజమాల వేసి సన్మానించారు. మాజీ రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్య చౌదరి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో వడ్డెర్ల సంఘం జిల్లా అధ్యక్షులు కుంచపు వెంకటేష్, శ్రీనాథ్ రెడ్డి, మహమ్మద్ రఫీ, బొమ్మినేని శివ, చిత్రాల శ్రీకాంత్, లోకనాథ్ రెడ్డి, వడ్డే హరికుమార్, విరాట్, మాజీ కార్పొరేటర్ సరిపూటి రమణ, జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణ కుమార్, మాజీ యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ నారాయణ స్వామి యాదవ్, మాజీ కో అప్షన్ సభ్యులు మున్వర్, స్టూడియో రాజు, చెర్లోపల్లి రామకృష్ణ, ఎన్‌బీకే నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

**భవాని ఆధ్వర్యంలో..**

జనసేన రాష్ట్ర కార్యక్రమాల కమిటీ ప్రధాన కార్యదర్శి భవాని రవికుమార్ ఆధ్వర్యంలో.. తన వ్యక్తిగత కార్యాలయంలో రాయల్ మురళి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. తొలుత కేక్ కట్ చేసి శాలువాతో సత్కరించారు. స్వీట్లు పంచిపెట్టారు. ఇలాంటి పుట్టినరోజులు మరన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు హర్ష, సంపత్ (టింకు), తదితరులు పాల్గొన్నారు.



## ప్రథమ చికిత్స సెంటర్లపై విస్తృత తనిఖీలు



**అనంతపురం, సెప్టెంబర్ 5 అనంత సూర్య :** అనంతపురం నగరంలోని పలు ప్రథమ చికిత్స సెంటర్లపై నకిలీ వైద్యుల నిరోధక కమిటీ ఐదు బృందాలుగా ఏర్పడి విస్తృత తనిఖీలు చేపట్టింది. నగరంలోని మేఘన, శ్రీసాయి క్లినిక్, సప్తగిరి, మహబూబ్ ప్రథమ చికిత్స సెంటర్లపై ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యులు తనిఖీలు చేపట్టారు. అనుమతులు లేకుండా ఆసుపత్రులు, క్లినిక్‌లు నిర్వహిస్తున్న వారిపై చర్యలు చేపట్టినట్లు డాక్టర్లు సుబ్బనాయుడు, సుబ్బారెడ్డి, శ్రీహరి తెలిపారు. అనుమతులు లేకుండా వైద్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# విద్యార్థులకు

## నూతన దుస్తులను అందజేత



అనంతపురం, సెప్టెంబర్ 5 అనంత సూర్య : నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం చైర్ పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలమురళి ఆధ్వర్యంలో విద్యార్థులకు నూతన దుస్తులను అందించారు. ట్రస్ట్ సభ్యులు కల్లమడి రవీంద్రనాథ్, రమాదేవి దంపతుల కుమార్తె సుచరిత పుట్టినరోజు సందర్భంగా కోవూరు నగర్‌లోని శ్రీ స్వామి దయానంద సరస్వతి, ఎయిమ్ ఫర్ సేవ ఆశ్రమంలోని విద్యార్థులకు శనివారం నూతన వస్త్రాలు, ప్యాంటులు, షర్ట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడుతూ.. జీవితంలో మనం చేసుకునే పండుగ లేదా పుట్టినరోజు వేడుకల సమయాల్లో ఇతరులకు సహాయం చేయడం ద్వారా జీవితకాలం గుర్తుండిపోయేలా ఉంటుందన్నారు. అలాగే ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యను నేర్పే గురువులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పుడు సహాయం పొందిన విద్యార్థులు సేవా గుణంతో మంచి ఉన్నత లక్ష్యాలను అలవర్చుకొని ఇతరులకు సహాయం చేసే స్థాయికి ఎదగాలన్నారు. అవసరంలోనూ.. ఆపదలోనూ ఉన్నవారికి సహాయం చేసే గుణాన్ని తనకు తెలియజేసిన తన గురువులకు ఉపాధ్యాయ దినోత్సవ, గురుపూజోత్సవ శుభాకాంక్షలు, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గురువులను ఏ విధంగా గౌరవించాలి, విద్యను ఎలా కాపాడుకోవాలన్న అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, ఆశ్రమ నిర్వాహకులు చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ,ఎస్టీల రక్షణకు నాలుగు అంచెల వ్యూహం

అమరావతి,సెప్టెంబర్ 5 : అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఎస్సీ,ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం అమలు, సంక్షేమంపై రాష్ట్రస్థాయి అత్యున్నత హైపవర్ కమిటీ సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో చిత్తూరు పార్లమెంట్ సభ్యుడు దగ్గుమళ్ల ప్రసాదరావు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులతో కలిసి పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీల రక్షణ, సంక్షేమం కోసం నాలుగు అంచెల వ్యూహాన్ని అమలు చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయించినట్లు ఎంపీ ప్రసాదరావు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని, బాధితులకు తక్షణమే పరిహారం అందేలా చూడాలని సీఎం స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో మంత్రులు అనిత, డీబీవీ స్వామి, జి.సంధ్యారాణి, ఎస్సీ,ఎస్టీ నియోజకవర్గాలకు చెందిన ఎంపీ కృష్ణప్రసాద్, పలువురు ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నట్లు ఎంపీ ప్రసాదరావు తెలిపారు.

# గుడి వెనుక.. నా సామి





- ఒంటరి మహిళల బలహీనతే ఆయుధంగా..
- సర్వం సమర్పిస్తేనే పాపనాశనమట..
- పూజారి ముసుగులో.. పాడు పనులు ?
- మహిళల రాత్రి బస పేరుతో కామకేలి !
- ఘోరాలు చూసి తట్టుకోలేక బాహ్య ప్రపంచంలోకి ఆ సామి సతీమణి
- ఫిర్యాదులు అందుతున్నా.. అంటి ముట్టనట్లుగా స్థానిక పోలీసులు ?
- రాప్తాడు ముఖ్య ప్రజా ప్రతినిధిరాలుపైనే.. బాధితురాళ్ల ఆశలు

**అనంతపురం, సెప్టెంబర్ 5 అనంత సూర్య :**

ఒంటరి మహిళల బలహీనతలను ఆసరాగా చేసుకుని ఓ వ్యక్తి పూజారి అవతారంలో మోసాలకు పాల్పడుతున్నాడనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. సర్వం సమర్పిస్తేనే పాపాలు పోతాయంటూ నమ్మబలికి, రాత్రి బస పేరుతో అసభ్య ప్రవర్తనకు పాల్పడుతున్నాడని కొందరు బాధితురాళ్లు వాపోతున్నట్లు తెలుస్తుంది. ఇదే విషయంపై పలువురు బాధితురాళ్లు స్థానిక పోలీసులకు ఫిర్యాదులు సమర్పిస్తున్నా.. అంటి ముట్టినట్లుగా వారి వ్యవహారం తయారైందని, ఇలాంటి దొంగ పూజారులపై నిఘా వ్యవస్థ లోతైన విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని, సంబంధిత పోలీస్ అధికారులు దొంగ స్వాములపై కఠిన చర్యలు తీసుకునేలా రాప్తాడు స్థానిక ముఖ్య ప్రజాప్రతినిధి ప్రత్యేక చొరవ చూపాలని పలువురు బాధితురాళ్లు **'అమ్మా.. నువ్వే దిక్కు'** అన్నట్లుగా వేడుకుంటున్నారని తెలుస్తుంది. ఈ సామి బాగోతాలను ఓ బాధిత మహిళ సతీమణిగా బయటకు వచ్చి నిజాలు వెల్లడించడం కోసమెరుపు. ఆ వివరాలు ఒకసారి పరిశీలిస్తే..

రాప్తాడు పరిధిలోని ఆ ఆశ్రమానికి సంబంధించిన ఆ సామి బుక్కరాయసముద్రం మండలం, మైనార్టీ కాలనీకి చెందినవాడని సమాచారం. అదే మండలంలోని కొట్టాలపల్లి గుడుల వద్ద మూఢనమ్మకాలు నమ్మరాదని బోర్డులు ఏర్పాటు చేయాలని విద్యావంతులు సైతం కోరుతున్నారు. అయితే మోసాలు పాల్పడుతున్న ఈ వ్యక్తి ఒంటరి మహిళలు ఆర్థికంగా బాగా ఉన్నవారు, కుటుంబ పరంగా బలంగా లేనివారిని టార్గెట్ చేసి సర్వం దోచుకుంటున్నాడని తెలిసింది. అయితే ఇంతటి మోసగాడిపై బాధిత మహిళలు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఎందుకు వారు పట్టించుకోవడం లేదన్న దానిపై పలు వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఇలాంటి స్వాములపై పూర్తిస్థాయి నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405